సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 5 । నవంబర్ । 2023



బాస్కెట్‌బాల్ ఎంపికలు
కడపలోని విద్యా మందిర్ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బాస్కెట్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. -8లో



చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
కడపలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయ సేవలపై లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ స్వర్ణప్రసాద్ అవగాహన కల్పించారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.1/24.0

వాతావరణం
జిల్లాలో శనివారం 24.0 - 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జమ్మలమడుగులో అత్యధికం
కడప అగ్రికల్చర్: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. కడప డివిజన్ పరిధిలోని వల్లూరులో 7.4 మి.మీ, చెన్నూరులో 2.8 మి.మీ, బద్వేల్ డివిజన్‌లోని అట్లూరులో 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జమ్మలమడుగులో అత్యధికంగా 15.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

6న తైక్వాండోకు ఎంపికలు
కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈ నెల 6వ తేదీ సోమవారం ఉదయం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి తైక్వాండో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు నిర్వహించే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు క్రీడా దుస్తులు, ఆధార్, స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీతో హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

స్టాఫ్‌నర్స్‌ల తుది జాబితా
కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలోని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ జాబితాను cfw.ap.nic.in వెబ్ సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 6వతేదీలోపు తెలపాలన్నారు. 8న ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటించి 10న అభ్యర్థుల నియామకాలకు కౌన్సిలింగ్ చేపడతామని తెలిపారు.

అడ్మిషన్లకు గడువు పెంపు
కడప సిటీ: పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకు గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్లు కడప పారా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.బాబు శనివారం తెలిపారు. డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్, అనస్తీషియా టెక్నీషియన్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, ఆప్తమాలజీ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ (మేల్), ఈజీసీ టెక్నీషియన్ కోర్సుల్లో మిగిలిన ఉచిత సీట్లు, ప్రభుత్వ కౌన్సెలింగ్ సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్‌లో ఏ గ్రూప్ ఉత్తీర్ణులైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీటు పొందిన విద్యార్థులకు ప్రభుత్వ పథకాలైనా జగనన్న వసతి, విద్యా దీవెన పథకాలు అందుతాయన్నారు. వివరాలకు 74165 23777, 74166 23777 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష
కడప ఎడ్యుకేషన్: ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్టు ఎగ్జామినేషన్-2023 కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు ఆధార్, ప్రామాణీకరించిన సర్వీస్ కాపీ డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి సూచించారు. ఆ దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం యొక్క డీఈఓ లాగిన్ ద్వారా మాత్రమే ఆమోదించి, హాల్ టికెట్లు ఇస్తారని చెప్పారు. దరఖాస్తు సమర్పించకపోతే పరీక్షకు హాజరయ్యేందుకు అనర్హులవుతారని డీఈఓ తెలిపారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో పెద్ద వెంకటసుబ్బారెడ్డి వేలి ముద్రలు తీసుకుంటున్న వలంటీరు భైరవుడు

చాపాడు: దూర ప్రాంతంలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి పింఛను అందజేసి గ్రామవలంటీరు మానవత్వం చాటుకున్నారు. చాపాడు మండలం సోమాపురం సచివాలయ పరిధిలోని నాగాయపల్లెకు చెందిన యాపరాల పెద్ద వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల తిరుపతిలోని స్విమ్స్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. పింఛను అందించే సమయం కావడంతో అతడు అందుబాటులో లేడు. దీంతో అనారోగ్యం విషయం తెలుసుకున్న వాలంటీరు భైరవుడు తిరుపతికి వెళ్లి వేలిముద్ర తీసుకుని పింఛన్ డబ్బుఅందజేశాడు. భైరవుడిని సర్పంచి శ్రీనివాసులురెడ్డి అభినందించారు.

ఉపాధి కూలీకి..నగదు హామీ

- బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూలీల ఖాతాకే నగదు
- ఇప్పటి వరకు 67 లక్షల పని దినాలు నమోదు



వీఎన్ పల్లె మండలం పాయసంపల్లెలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలు

కడప సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల ఖాతాకు నేరుగా నగదు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానం అమలు చేస్తోంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా జియో ట్యాగ్ ఆధారంగా ఫొటోలు అప్‌లోడ్ చేస్తే ఆన్‌లైన్‌లో అటెండెన్స్ వేస్తారు. అనంతరం డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నగదు కూలీల ఖాతాకు నేరుగా జమ చేస్తారు. ఇందుకోసం కూలీల ఆధార్‌ను బ్యాంకుకు అనుసంధానించే ప్రక్రియను అధికారులు దాదాపు పూర్తి చేశారు. నూతనంగా అమలు చేస్తున్న ఈ పద్ధతితో కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- వైఎస్సార్ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2,41,808 జాబ్ కార్డులు కాగా, ఇందులో 1,98,991 జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. 4,37,501 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ప్రస్తుతం పనికి వస్తున్న కూలీల సంఖ్య 2,23,012 కాగా, 1,39,949 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఆధార్ కార్డుకు అనుసంధానమైన కూలీల సంఖ్య 4,36,511(99.77 శాతం)గా ఉంది. కేవలం 990 మంది ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంది. డేటాలో తేడాలు, బయోమెట్రిక్ పడకపోవడం, బ్యాంకు ఖాతాకు సరిపోకపోవడం, ఊర్లలో ఉండకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఉన్నందువల్ల ఈ పెండింగ్ శాతం కనిపిస్తోంది.

ఆన్‌లైన్‌లో అటెండెన్స్ విధానం
ఉపాధి హామీ పథకం కింద సాధారణ మస్టర్ విధానంతో ఉపాధి కూలీలకు డబ్బు జమ చేస్తూ వచ్చారు. ఇందులో అక్రమాలు వెల్లువెత్తడంతో అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తర్వాత జియో ట్యాగ్ ద్వారా నేరుగా కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ అటెండెన్స్ విధానం తీసుకొచ్చారు. తాజాగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) సాఫ్ట్‌వేర్‌ను తీసుకురావడంతో కూలీలకు మరింత మేలు జరిగింది. ఈ విధానంతో పనికి వచ్చిన కూలీలకు మాత్రమే వేతనాలు అందుతాయి. ఇప్పటికే ఆధార్ సంఖ్య అనుసంధానం చేయడంతో పనికి రాకుండా మోసంచేసే పరిస్థితి ఉండదు. ఉపాధి కూలీల్లో ఒకరి పేరుతో మరొకరు పనికి హాజరు కావడం, పనికి రాకుండా హాజరు వేసే అక్రమాలకు తావుండదు.

డీబీటీ విధానంతో చెల్లింపులు



గతంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సంబంధిత శాఖకు నగదు బదిలీ చేసిన తర్వాత కూలీల ఖాతాల్లో డబ్బులు జమయ్యే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఎస్ఎన్ఏ స్పర్శ్ సాఫ్ట్‌వేర్ విధానంలో ఆధార్ సంఖ్య బ్యాంకుకు అనుసంధానమైంది. దీంతో 80 శాతం కేంద్రం, 20 శాతం రాష్ట్రప్రభుత్వాలు డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా చెల్లిస్తాయి. కేంద్ర ప్రభుత్వమే నేరుగా సంబంధిత కూలీల ఖాతాలకు సొమ్ము జమ చేస్తోంది. దీంతో వేతనాలు సకాలంలో అందడంతోపాటు కూలీలకు మేలు జరుగుతుంది. వారానికి రెండు దఫాలుగా ఖాతాల్లో డబ్బులు జమయ్యే అవకాశం ఉంది.

67 లక్షల పనిదినాలు



2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద పనుల కల్పనకు మొత్తం బడ్జెట్ రూ.329 కోట్లు. నీటి సంరక్షణ పనులకు సంబంధించి డగౌట్ పాండ్స్, కాలువల పూడికతీత, చెరువుల్లో పూడికతీత, కందిత కందకాలు, నీటి నిల్వ కారకాలు, ఫారంపాండ్స్, ప్లాంటేషన్, హార్టికల్చర్ పనులు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, రోడ్లు, సీసీ డ్రెయిన్స్ తదితర పనులను చేపడుతున్నారు. కూలీల ఖర్చుకు రూ.198.56 కోట్లు, మెటీరియల్‌కు రూ.131కోట్లు కేటాయించారు. 73 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యం కాగా, ఇప్పటివరకు 67 లక్షల పని దినాలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. మార్చి 31వ తేదీ నాటికి మిగిలిన పనిదినాలు పూర్తి చేయాల్సి ఉంది.

సమష్టి కృషితోనే సాధ్యం



జిల్లాలో ఉపాధి హామీ కూలీల బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. చిన్న చిన్న కారణాలతో కేవలం 0.33 శాతం నమోదు చేయాల్సి ఉంది. మిగిలిన వారికి కూడా అనుసంధానం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. మిగతా జిల్లాలతో పోలిస్తే వైఎస్ఆర్ జిల్లాలో సిబ్బందిసమష్టి కృషితో అనుసంధానం విషయంలో ముందున్నాం.

– పి.యదుభూషణరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కడప

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కేబినెట్‌లో కులగణన తీర్మానంపై బీసీ నాయకుల హర్షం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

కడప కార్పొరేషన్: ఆంధ్ర ప్రదేశ్‌లో కులగణన చేయాలని ఏపీ కేబినెట్‌లో తీర్మానించడంపై బీసీ సంఘర్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కడప బాలాజీ కాలనీలో మహాత్మాజ్యోతీరావు ఫులె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమితి నాయకులు మాట్లాడుతూ 70 ఏళ్లుగా బీసీ గణన చేయాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం సంక్షేమ ఫలాలు బీసీ సామాజిక వర్గాలకు అందడానికి బీసీ గణన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దేశంలో తొలిసారి బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కులగణన చేశారని, ఆ తర్వాత దక్షిణ భారతదేశంలో బీసీ గణన చేపట్టిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు ఎ.లక్ష్మయ్య, కోర్ కమిటీ సభ్యులు బి.లక్ష్మయ్య యాదవ్, ఎస్.ప్రభాకర్, బీవీ కేశవులు, డా.మస్తానమ్మ, కె.చంద్రబాబుయాదవ్, వి.రమణ, రామయ్య, సురేష్ బాబు, వాసు యాదవ్, అరుణ్ కుమార్ యాదవ్, గౌడ సంఘం నారాయణ స్వామి, దాము, ఉమాపతి ఆచారి, బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు బైపాస్ సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నుంచి కర్నూలుకు ప్రయాణించే ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి చేరుకునేలా బైపాస్ రైడర్ సర్వీసు ఏర్పాటుచేశామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాలలో బైపాస్ మీదుగా బస్సులు వెళ్తాయని, తద్వారా 45 నిమిషాల ప్రయాణ సమయం తగ్గుతుందని తెలిపారు. 6వతేదీ నుంచి ఉదయం 4.30, 5.30, 6.30 గంటలకు ఈ సర్వీసులు బయలుదేరుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

25శాతం ఛార్జీల తగ్గింపు: కడప నుంచి ఎంజీబీఎస్, బీహెచ్ఈఎల్‌లకు వెళ్లే డాల్ఫిన్ ఏసీ సర్వీసులకు ఛార్జీలో 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు డీఎం డిల్లీశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం కడప నుంచి ఎంజీబీఎస్‌కు రూ.1220, బీహెచ్ఈఎల్‌కు రూ.1270 ఛార్జీ ఉందన్నారు. 25 శాతం తగ్గింపుతో ఎంజీబీఎస్‌కు రూ. 940, బీహెచ్ఈఎల్‌కు రూ. 980గా నిర్ణయించామన్నారు. దూర ప్రాంతాల సర్వీసులకు ఒకేసారి రాను, పోనూ టిక్కెట్ రిజర్వు చేసుకుంటే పది శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్, బాల్య వివాహాల నివారణ, నాడు నేడు, జగనన్నకు చెబుదాం అంశాలపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పటిష్టంగా నిర్వహించామన్నారు. ఈ నెల 10వ తేదీలోపు ఆరోగ్యశ్రీ ఈకేవైసీని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా పది, ఇంటర్మీడియట్ అనుత్తీర్ణులైన విద్యార్థుల వివరాలు మళ్లీ ఎన్‌రోల్ చేయిస్తామన్నారు. నవంబర్ 15 నుంచి చేపట్టే భారత సంకల్ప యాత్ర విజయవంతానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.




వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్ కుమార్

అరుణాచలం..రైలులోనూ వెళదాం

పంచభూతాత్మక లింగాల్లో అగ్ని లింగం తేజో లింగంగా పేరొందిన అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి అధికంగా ఉంటోంది. గిరి ప్రదక్షిణకు వేలాది మంది భక్తులు తరలి వెళుతుంటారు. కడప మీదుగా రైలు సదుపాయం ఉన్నా అవగాహన లేక భక్తులు బస్సులను ఆశ్రయిస్తున్నారు.

- అతి తక్కువ చార్జీతో ప్రయాణం చేద్దాం
- అన్ని వర్గాలకు అనుకూలంగా రైళ్లు



అరుణాచలం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నుంచి అరుణాచలానికి రోడ్డు మార్గాన వెళ్లేందుకు దాదాపు 300 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో సూపర్‌లగ్జరీలో వెళితే దూరాన్ని బట్టి రానుపోను రూ.1072 చార్జీగా ఉంది. కారులో వెళితే దాదాపు రూ.8 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. వీటన్నింటితో పోలిస్తే రైలులో ప్రయాణిస్తే చార్జి తక్కువగా ఉన్నా వేరే వాహనాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది.

సమీపంలోని స్టేషన్లు
వైఎస్సార్ జిల్లా నుంచి పలు రైళ్లు అరుణాచలం సమీపానికి వెళుతుంటాయి. కడప నుంచి విల్లుపురం 360 కిలోమీటర్ల దూరంలో ఉంది. విల్లుపురం నుంచి అరుణాచలం 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎవరైనా అరుణాచలం వెళ్లాలంటే విల్లుపురం వరకు రైలులో వెళ్లాలి. అక్కడి నుంచి రైలులోగానీ, బస్సులో, ఇతర వాహనాల్లో కూడా వెళ్లవచ్చు.

- అహ్మదాబాద్ నుంచి తిరుచ్చి(09419) వెళ్లే వారాంతపు రైలు ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు చేరుకుని అదేరోజు సాయంత్రం 7.15 గంట లకు విల్లుపురం చేరుకుటుంది. తిరిగి ఇదే రైలు (094 20) మధ్యాహ్నం 12.10 గంటలకు విల్లుపురంలో బయలుదేరి కడపకు రాత్రి 8.25 గంటలకు చేరుతుంది. ఈ రైలు కడప స్టేషన్‌లో మాత్రమే ఆగుతుంది.
- లోకమాన్యతిలక్ మధురై ఎక్స్‌ప్రెస్ (22101) ప్రతి గురువారం తెల్లవారుజామున కడపకు 5.40 గంటలకు చేరుకుని అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విల్లుపురానికి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 22102 నంబరుగల రైలు విల్లుపురంలో శుక్రవారం రాత్రి 8.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు అర్ధరాత్రి 3.08 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులో రానుపోను రూ. 540 చార్జిగా ఉంటుంది.
- ముంబై-కరైకాల్ (11017) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు కడపకు వస్తుంది. మధ్యాహ్నం 1.55 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరిగి ఇదే రైలు (11018) విల్లుపురంలో సాయంత్రం 7.25 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు చేరుతుంది.
- ముంబై-నాగర్‌కోయిల్ (16351) ఎక్స్‌ప్రెస్‌లో వారంలో రెండుమార్లు నడుస్తుంది. ఈ రైలు మంగళ, శనివారాలలో మధ్యాహ్నం 1.20 గంటలకు కడపకు చేరుకుని విల్లుపురంకు రాత్రి 9.30 గంటలకు చేరుతుంది.



విల్లుపురం రైల్వేస్టేషన్

కడప నుంచి..



కడప రైల్వేస్టేషన్

కడప నుంచి అరుణాచలానికి ఓకా–మధురై ఎక్స్‌ప్రెస్ (09520) రైలు అందుబాటులో ఉంది. ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం సాయంత్రం 6.05 గంటలకు కడపకు చేరుకుని అరుణాచలానికి మరుసటిరోజు తెల్లవారుజామున 3.40 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు (09519) అరుణాచలంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 1.55 గంటలకు కడపకు వస్తుంది. ఈ రైలులో జనరల్ క్లాస్‌లో రూ.130 వరకు చెల్లించాల్సి ఉంటుంది. స్లీపర్‌లో ఒక్కొక్కరికి పోను రూ. 385, రాను రూ. 385 కలిపి మొత్తం రూ.770, ఏసీ త్రీటైర్‌లో రానుపోను రూ. 2350 ఉంటుంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ జిల్లా నుంచి అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. నేరుగా వెళ్లేందుకు ఓకా–మధురై ఎక్స్‌ప్రెస్, కడప నుంచి అరుణాచలానికి సమీపంలోగల విల్లుపురానికి వెళ్లే రైళ్లు అందుబాటులో ఉన్నాయి. కడప నుంచి కాట్పాడికి వెళ్లి అక్కడి నుంచి నేరుగా అరుణాచలానికి వెళ్లవచ్చు. రైల్వేశాఖ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. – శేఖర్ కుమార్, స్టేషన్ మేనేజర్, కడప రైల్వేస్టేషన్

ఆటాడుకుందాం.. రా..!

- పాఠశాల విద్యలో క్రీడలకు ప్రాధాన్యం
- 57 రకాల క్రీడా సామగ్రి పంపిణీ

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. పాఠశాల స్థాయి నుంచే ఆటలపై ఆసక్తి పెంచేలా చేస్తోంది. ఇందుకోసం వ్యాయామ విద్యను బలోపేతం చేస్తోంది. అన్ని పాఠశాలలకు వివిధ రకాల క్రీడా సామగ్రి అందజేస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలలకు చేరగా, మరి కొన్ని రోజుల్లో మిగతా వాటికీ అందనున్నాయి.

కడప స్పోర్ట్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన పగ్గాలు చేపట్టిన వెంటనే.. క్రీడల రిజర్వేషన్‌ను 2 శాతం అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా వేలాది మంది క్రీడాకారులు స్పోర్ట్స్ రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు సైతం పొందారు. దీంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు ప్రకటించారు. మరో వైపు సీఎం కప్ నిర్వహణ, త్వరలో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్రంలో క్రీడా సంబరాలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేలా క్రీడా సామగ్రి పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వ్యాయామ విద్యను సైతం కరికులంలో భాగం చేసి ఒక సబ్జెక్టుగా ప్రాధాన్యతను ఇస్తుండటం విశేషం. తొలిసారిగా వ్యాయామ ఉపాధ్యాయులకు సైతం స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తూ వ్యాయామ విద్యలో వస్తున్న మార్పులు, అప్‌డేట్స్ అందిపుచ్చుకునేలా శిక్షణ అందిస్తున్నారు.

పాఠశాల స్థాయి నుంచే..

ప్రాథమిక పాఠశాల నుంచే క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, (ప్లస్ టు) జూనియర్ కళాశాలలకు సైతం క్రీడా సామగ్రి అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలకు రూ.3,400, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.7,800, ఉన్నత పాఠశాలకు రూ.17,700 చొప్పున వెచ్చించి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు, మొత్తం మీద 57 రకాల క్రీడా సామగ్రి పంపిణీ చేస్తోంది. సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నేరుగా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని మండలాల్లో పాఠశాలలకు క్రీడా


వాలీబాల్ సాధనలో క్రీడాకారులు


పాఠశాలలకు చేరిన క్రీడా సామగ్రి

సామగ్రి అందగా, మరికొద్ది రోజుల్లో అన్ని పాఠశాలలకు సరఫరా చేయనున్నారు. జిల్లాలో 13 ప్రభుత్వ మేనేజ్‌మెంట్, 1851 జిల్లా పరిషత్, 84 మున్సిపల్ మేనేజ్‌మెంట్ కింద ఉన్న పాఠశాలలకు తొలివిడతలో పంపిణీ చేయనున్నారు.

సరఫరా చేసే క్రీడా పరికరాలు

ప్రాథమిక పాఠశాలలకు : క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫ్రిస్బీ, మల్టీకలర్ హూలా, హూప్స్, స్టెప్ హర్డిల్స్, స్కిప్పింగ్ రోప్.

ప్రాథమికోన్నత పాఠశాలలు : వాలీబాల్, త్రోబాల్స్, టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ రబ్బర్, కోన్స్‌మార్క్‌లగ్, స్టెప్ హార్డిస్, ఫ్రిస్బీ.

ఉన్నత పాఠశాలలు : వాలీబాల్స్, వాలీనెట్, త్రోబాల్స్, త్రోబాల్ నెట్, హ్యాండ్‌బాల్స్, టెన్నికాయిట్స్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్స్, చెస్ సెట్, ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, మెజరింగ్ టేప్, యోగామ్యాట్, ఫుట్‌పంప్.

వ్యాయామ విద్య బలోపేతం



రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ క్రీడలకు చక్కటి ప్రోత్సాహం ఇస్తోంది. ఇందులో భాగంగా వ్యాయామవిద్యను బలోపేతం చేసేందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడాసామగ్రి పంపిణీకి చర్యలు చేపట్టింది. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు క్రీడాసామగ్రి ఉపయోగపడుతుంది. మెటీరియల్ పంపిణీ ప్రక్రియ ప్రారంభించాం, అన్ని పాఠశాలలకు స్పోర్ట్స్ మెటీరియల్ అందజేస్తాం.
– జి.భానుమూర్తిరాజు, వ్యాయామవిద్య తనిఖీ అధికారి, జోన్–4, కడప

నాణ్యమైన పరికరాలు అందజేత



విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే క్రీడల వైపు నడిపించేలా క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తున్న విద్యా శాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. నాణ్యమైన క్రీడా పరికరాలను నేరుగా పాఠశాలలకు సరఫరా చేస్తుండటం అభినందనీయం. వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయడం శుభపరిణామం.
– బి.శివశంకర్‌రెడ్డి, ఏపీ ఎస్‌పి (పీఈ) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కడప

క్లుప్తంగా

18 బస్తాల బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం, ఆటోతో విజిలెన్స్ అధికారులు

వేంపల్లె : స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద శనివారం 18 బస్తాల చౌకడిపో బియ్యాన్ని పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నందిమండలం గ్రామానికి చెందిన ఖదీర్ కదిరికి 18 బస్తాల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేసి, వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న సరస్వతమ్మ

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లి పట్టణంలో జరిగింది. చంద్ర కాలనీకి చెందిన రమణప్ప భార్య సరస్వతమ్మ (70) మోకాళ్ల నొప్పులు అధికంగా ఉండడంతో మనవడితో కలిసి ద్విచక్ర వాహనంలో పట్టణంలోని ఆసుపత్రికి వచ్చింది. చికిత్సలు ముగిసిన అనంతరం తిరిగి ఇంటికి వెళుతుండగా.. కదిరి రోడ్డులోని సంగం ఫంక్షన్ హాల్ స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో వాహనంలో వెనక కూర్చున్న సరస్వతమ్మ కిందపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే గమనించిన స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు విచారణ చేస్తున్నారు.

కరెంటు షాక్‌తో..


తీవ్రంగా గాయపడిన ఆవుల చంద్ర

మదనపల్లె : కరెంటు షాక్‌తో గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం మొలకలచెరువు మండలంలో జరిగింది. ఎగువకుంట గ్రామానికి చెందిన ఆవుల చంద్ర (48) గొర్రెలు మేపుతూ జీవిస్తున్నాడు. శనివారం యథావిధిగా గొర్రెలు తోలుకొని బిల్లులవారిపల్లె సమీపంలో మేపుతుండగా.. వాటిని పక్కకు తోలేందుకు ప్రయత్నించాడు. అక్కడే కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు సమాచారం అందించిన వెంటనే 108 అంబులెన్స్ వచ్చి.. బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించింది. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని విద్యామందిర్ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బాస్కెట్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికలను సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు సాజిత్, విజయలక్ష్మి, ఇజ్రాయిల్ ప్రారంభించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వనాథ్, వెంకటసుబ్బమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–14 బాలికలు : నందిని, చంద్రమౌనిక, మౌనిక, అమృతవర్షిణి, గీతికాంజలి, హర్షిణి, రెడ్డి సాయి, మేఘన, సాయికుమారి, సింధు, శరణ్‌యదేవి, హాసిని. **స్టాండ్‌బై :** శ్రావణి, కావ్యశ్రీ.

అండర్–14 బాలురు : చరణ్, కార్తీక్, గౌరీశంకర్, రామమోహన్‌రెడ్డి, అరుణ్, భరద్వాజ్, శ్రీనికేత్, ఉమేష్, శశాంక్, ప్రవీణ్‌కుమార్, మనోజ్‌కుమార్, హరీష్. **స్టాండ్‌బై :** సుబ్రమణ్యం, శ్యామ్యూల్ జోనాథ్, విష్ణుమూర్తి, సుహైల్.


ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

అండర్–17 బాలికలు : రజియా, గౌతమి, తన్మయ్, మాబి, దీప్తి, యశస్విని, రమ్య, మేఘశ్రీ, తేజస్విని, అర్చనాచంద్రిక, వర్షిత, రిజ్వాన్. **స్టాండ్‌బై :** ఎం.సాయికళ, ఎల్. ప్రసూన, కె.లలిత, ఎం.చరితారెడ్డి, పుష్పాంజలి, దివ్య.

అండర్–17 బాలురు : సాయియశ్వంత్, గౌతమ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రిషికుమార్, జ్ఞానేంద్రయాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, జయదీప్ సుభాకర్, చరణ్, అన్వర్‌హుస్సేన్, అబ్దుల్ రౌఫ్, యశ్వంత్, నరసింహారెడ్డి. **స్టాండ్‌బై :** అభిషేక్, నరసింహులు, రామ్‌చరణ్, ఓంకార్, మోహన్‌రెడ్డి, నాగూర్‌బాషా.

'గడియారం' పోస్టల్ కవర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : కవి గడియారం వెంకటశేష శాస్త్రి పేరుపై రూపొందించిన తపాలా కవర్‌ను స్థానిక హెడ్ పోస్టాఫీసులో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ గడియారం వెంకటశేషశాస్త్రి శివభారతంతోపాటు ఎన్నో రచనలు చేశారన్నారు. ఆయన అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేశారని, అవధానాలు కూడా చేస్తుండే వారని తెలిపారు. తపాలా శాఖ కర్నూలు రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.న్యామతుల్లా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ కవర్లు వెళతాయని, ఆయన గురించి అందరూ తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో గడియారం కుటుంబీకులు గడియారం వెంకట శేషశర్మ, నరసింహశర్మ, రిటైర్డు పోస్టుమాస్టర్ కంబగిరి రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్, పోస్టుమాస్టర్ సుబ్బరాయుడు, ఫిలాటలిస్టు సదాశివారెడ్డి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


తపాలా కవర్లను ఆవిష్కరిస్తున్న నరాల రామారెడ్డి, పోస్టల్ అధికారులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ స్వర్ణప్రసాద్

వైవీయూ : ప్రతి ఒక్కరూ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయసేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులు లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం కాని సమస్యలకు కూడా శాశ్వత లోక్‌అదాలత్‌లో పరిష్కారం లభిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి


పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది (ఇన్‌సెట్) నేర సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా వుంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఘటనలు జరగడానికి వీల్లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్లు, చెడునడత కలవారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా వుంచాలని పేర్కొన్నారు.

శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి

నేర సమీక్షకు ముందు జిల్లా ఎస్పీ ప్రాసిక్యూషన్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో నిందితులుగా వున్న రౌడీషీటర్లకు న్యాయస్థానాల్లో తగిన సాక్ష్యాధారాలతో శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా వారి అక్రమ కార్యకలాపాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట చేసేందుకు వీలవుతుందని తెలిపారు. 'దిశ' ట్రాక్ కేసులు అనగా మహిళలు బాధితులుగా వున్న కేసులు, పోక్సో తదితర ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసుశాఖ వైపు నుంచి పూర్తి సహకారం అందజేస్తామని జిల్లా ఎస్పీ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏ.పి.పి.లకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఖదీరున్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు సంస్కారం నేర్పించాలి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు విద్యతోపాటు సంస్కారం, లోకజ్ఞానాన్ని నేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకరెడ్డి అన్నారు. కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవెలప్‌మెంట్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహించిన రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్యంగా, మానసికంగా ఉన్నప్పుడు మాత్రమే విద్య బాగా సాగుతుందన్నారు. మూడు నుంచి ఎనిమిది ఏళ్ల వయసు గల పిల్లలు అందరూ తప్పకుండా చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలను చేయగలిగేలా చేయడం ఈ శిక్షణ ఉద్దేశం అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా ఇస్మాయిల్, పర్యవేక్షకురాలిగా ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఎంఓ రామాంజనేయరెడ్డి, జీసీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

నాటు సారా స్వాధీనం

పెద్దమండ్యం : నాటుసారా స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. మండలంలోని రామానాయక్‌తండా పంచాయతీ బండకింద తండాలో ఎస్ఐ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. బుక్కే రవి నాయక్ వద్ద రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

రామసముద్రం : మండలంలోని కాప్పల్లె గ్రామానికి చెందిన ఓ వివాహిత శుక్రవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాప్పల్లె గ్రామానికి చెందిన రాఘవరెడ్డి భార్య జ్యోతి(30) శుక్రవారం ఉదయం ఆస్తి తగాదా విషయమై పురుగుల నివారణ మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జ్యోతిని చికిత్స నిమిత్తం పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ సత్యమ్మతల్లి ఆలయ హుండీని శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి నగదు అపహరించారు. గతంలో కూడా ఈ హుండీలో డబ్బు చోరీకి గురైందని, కావున పుల్లంపేట పోలీసులు దొంగలను పట్టుకోవాలని గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

మదనపల్లె : అనారోగ్యంతో మంచంపై నిద్రిస్తున్న వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడిని శనివారం అరెస్ట్ చేశారు. తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీలో వేణుగోపాల్ భార్య రెడ్డెమ్మ(58) మూడేళ్లుగా నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై ఓ గదిలో నివాసం ఉంటోంది. రెడ్డెమ్మను కుటుంబ సభ్యులు ఈశ్వరమ్మకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అందులో ఉంచారు. ఈ నెల 1వతేదీ రాత్రి 9.30 గంటల సమయంలో రెడ్డెమ్మ భర్త వేణుగోపాల్, మనువడు హేమంత్ భోజనం పెట్టేందుకు ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో తలుపులు వేసి ఉండటంతో అనుమానం వచ్చి తట్టారు. సాధారణంగా ఆమె తలుపులు వేసుకునే స్థితిలో లేకపోవడంతో.. ఎప్పుడూ తీసి ఉంచేవారు. దీంతో వేసిన తలుపులను గట్టిగా తోయడంతో తెరుచుకున్నాయి. లోపలకు వెళ్లి చూస్తే రెడ్డెమ్మ అపస్మారకస్థితిలో మంచంపై నుంచి కిందపడి ఉండగా, మంచంపై ఓ వ్యక్తి పడుకుని ఉండటాన్ని గుర్తించారు. కిందపడిన రెడ్డెమ్మను పరీక్షించగా, ఆమె అప్పటికే చనిపోయి ఉండటంతో.. అతన్ని స్థానికులు పట్టుకుని చితక్కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో హత్య చేసిన నిందితుడు వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ చిట్టిబండకు చెందిన వెంకటరమణ కుమారుడు యానాదిరవి(33)గా గుర్తించారు. నిందితుడు తన భార్య చెంచులక్ష్మి, కుటుంబంతో కలిసి మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ రామాపురం సమీపంలోని గంగారప్ప నరేంద్రనాయుడు తోటవద్ద కాపలా ఉంటున్నాడు. తరచూ కుటుంబ అవసరాల కోసం పట్టణంలోకి వచ్చి, తిరిగి వెళ్లే సమయంలో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటికి వెళుతూ రెడ్డెమ్మ ఇంటి వద్ద ఆగాడు. ఇంటిలో ఎవరూ లేకపోవడం, బాధితురాలు ఒంటరిగా మంచంపై పడుకుని ఉండటాన్ని చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. తాలూకా సీఐ సత్యనారాయణ ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శుక్రవారం సాయంత్రం నిందితుడు యానాదిరవిని మదనపల్లె పట్టణం చెంబకూరు రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. రిమాండ్ నిమిత్తం శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితుడు

మదనపల్లె : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో.. భర్తను భార్య హత్య చేసిన కేసులో మరొకరిని అరెస్ట్ చేశారు. నిందితుడు షేక్ బషీర్‌ను పుంగనూరు రోడ్డు మున్సిపల్ ఆర్చ్ వద్ద శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచారు. వన్‌టౌన్ సీఐ మహబూబ్ బాషా తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అక్టోబర్ 29వ తేదీ రాత్రి మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లెలోని వినాయకుని గుడి వీధిలో ఉన్న డి.వెంకటశివ (45) మద్యం మత్తులో ఇంటి వద్దకు వచ్చి పడిపోగా తలకు గాయమైంది. ఇదే అదనుగా భావించిన అతని భార్య రమణమ్మ (40), తనతో వివాహేతర సంబంధం పెట్టుకున్న గంగాధర్ అలియాస్ గగన్ (21), అతని సోదరి ఎం.బిందుప్రియలను ఇంటికి పిలిపించింది. ముందుగా అనుకున్న ప్రకారం ముగ్గురూ కలిసి వెంకటశివను హత్య చేశారు. ముందుగా రమణమ్మ తన భర్త తలపై రోకలిబండతో మోదింది. గగన్ మెడకు తాడు బిగించాడు. రమణమ్మ కాళ్లు గట్టిగా పట్టుకోవడంతో ఊపిరాడక చనిపోయాడు. వెంటనే తన అత్తింటి వారికి ఫోన్ చేసి.. తన భర్త మద్యం తాగి వచ్చి కింద పడి మృతి చెందాడని సమాచారం అందించింది. మృతదేహాన్ని స్థానికుడైన ఆటో డ్రైవర్ రవి సాయంతో స్వగ్రామం కలకడ మండలం సింగనొడ్డిపల్లికు తీసుకువెళ్లింది. అక్కడ వెంకట శివ బంధువులకు అనుమానం వచ్చి ఆమెను గట్టిగా నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కలకడ పోలీసులు అందించిన సమాచారంతో మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహబూబ్ బాషా సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులు కాగా రమణమ్మ, గగన్, బిందుప్రియలను ఇది వరకే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రమణమ్మతో వివాహేతర సంబంధం కలిగి వెంకటశివను హత్య చేసేందుకు ఆర్థిక సాయం అందించిన.. ఆమె మరో ప్రియుడు షేక్ బషీర్ పరారీలో ఉండగా, శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.